# ఎంతటి వరదైనా తట్టుకునేలా చర్యలు

**మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్**

**చెరువులో చేపలు పెంచుకుంటామని ఛైర్మన్‌ను కోరిన ముదిరాజ్‌లు**

**మహబూబ్‌నగర్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** మళ్లీ భవిష్యత్తులో వర్షాలు వచ్చినా, మిని ట్యాంక్ బండ్ వరద తాకిడికి తట్టుకునేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్, ఇరిగేషన్ అధికారులను మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్ ఆదేశించారు. మున్సిపల్ ఇరిగేషన్ అధికారులతో కలిసి మిని ట్యాంక్ బండ్‌ను ఛైర్మన్ పరిశీలించారు. ముదిరాజ్ సోదరులు తాము చెరువులో చేపలు పెంచుకుంటున్నామని మాకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలని ఆర్జీ పెట్టుకున్నారు. ఇదే విషయాన్ని ముడా అధికారులతో మాట్లాడుతూ పట్టణ ప్రజలను దృష్టిలో పెట్టుకొని, చెరువు సంరక్షణ, ముదిరాజ్ సోదరులకు నష్టం కలగకుండా, ఆదుకుంటామని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులతో చర్చించారు. ముదిరాజ్ సోదరులు గోపాలరెడ్డి, ఆంజనేయులు, గోవర్ధన్, నాగరాజు, శ్రీనివాసులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.



చెరువును పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ ఆనంద్‌గౌడ్

# మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి పొంగులేటి పరామర్శ



లక్ష్మారెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**జడ్చర్ల, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డా. సి.లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతా రెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా, లక్ష్మంరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించే నిమిత్తం రాష్ట్ర రెవెన్యూ, సమచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచకు జడ్చర్ల మీదుగా వెళుతుండగా, జడ్చర్ల వద్ద మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, ఆర్డీఓ నవీన్, తహసిల్దార్ రాజీవ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసి పుష్పాలమొక్కలు అందజేశారు. అనంతరం మంత్రి నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచలో మాజీ ఎమ్మెల్యే డా.సి. లక్ష్మారెడ్డి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.

# మిల్లర్లు రోజుకు 40ఏ.సి.కెలు ధాన్యం ఇవ్వాలి

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి ప్రతినిధి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కు మిల్లర్లు ఇవ్వాల్సిన ధాన్యం రోజుకు 40 ఏ.సి.కె లు ఇచ్చే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో బియ్యం అప్పగింత పై సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు ఏ రైస్ మిల్లు ఎంత ధాన్యం అప్పగించింది ఇంకా ఇవ్వాల్సిన ధాన్యం ఎంత అనే దానిపై మిల్లు వారిగా సమీక్ష నిర్వహించారు. ఇప్పటికీ జిల్లా నుండి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, సివిల్ సప్లై శాఖకు ఇవ్వాల్సిన ధాన్యం చాలా పెండింగ్ ఉందని అందువల్ల వచ్చే 20 రోజులు రోజుకు 40 ఏ.సి.కె ల చొప్పున బియ్యం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డి.టి లను ఆదేశించారు. ఇందులో ఉప్పుడు బియ్యం రోజుకు 15 ఏ.సి.కె లు ఇచ్చే విధంగా సివిల్ సప్లై అధికారి, డి.యం సివిల్ సప్లై బాధ్యతలు తీసుకోవాలని, మిగిలిన 25 ఏ.సి.కె ల మూడి బియ్యం బాధ్యతలను ముగ్గురు డి.టి లకు అప్పగించారు. బియ్యం బాగా ఇచ్చే మిల్లులకు ప్రోత్సహకం ఇవ్వడం జరుగుతుందని, ఇవ్వని రైస్ మిల్లులు బ్లాక్ లిస్టులో ఉంచడం జరుగుతుందన్నారు. సెలవుతో సంబంధం లేకుండా ప్రతి రోజూ 40 ఏ.సి.కె ల ధాన్యం ఎఫ్.సి.ఐ కి వెళ్ళే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ యం.నగేష్, జిల్లా సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, డి.యం షేక్ ఇర్ఫాన్, డి.టి.లు, తహశీల్దార్ మదన్ మోహన్ పాల్గొన్నారు.



సివిల్ సప్లై అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

# గద్వాల జిల్లా ఇంఛార్జిగా జితేందర్ రెడ్డి

**గద్వాల, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** సెప్టెంబర్ 17 న ప్రజా పాలన దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్నది. జోగులాంబ గద్వాల జిల్లా ఇంచార్జిగా ఢిల్లీ లో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి, క్రీడల శాఖరాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, మాజీ లోక్ సభ పక్ష నాయకుడు జితేందర్ రెడ్డి ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 17న ఆ రోజు జాతీయ మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ఆయా జిల్లాల జాతీయ జెండాను ఎగుర వేయనున్నారు. మొదటి సారి 17 సెప్టెంబర్ ను ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహిం చేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చెపట్టనున్నది. కాంగ్రెస్ పాలనలో సెప్టెంబర్ 17 న ప్రజా పాలన దినోత్సవంగా అధికారిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 32 జిల్లా ల వారీగా పాల్గొనేవారి లిస్ట్ విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని ప్రభుత్వ ఆఫీసులు, స్థానిక సంస్థల కార్యలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ జెండా ఎగురవేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట

# వనపర్తికి హైడ్రా..?



బఫర్ జోన్ లో కట్టుకున్న ఇండ్లు

- ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు..
- రియల్ ఎస్టేట్ వ్యాపారుల చేతుల్లో మోసపోతున్న నిరుపేదలు
- కొనుగోలుదారుల ఆస్తులు జలమయం
- ఇప్పటికే పలు శాఖల సంయుక్త ఆధ్వర్యంలో కూల్చివేతలు
- జిల్లా కేంద్రంలో 17మంది ఇంటి యజమానులకు నోటీసులు జారీ
- జిల్లా కేంద్రంలో అక్రమ వెంచర్లలో వెలిసిన ప్రహరీ గోడలను కూల్చివేత

**వనపర్తిప్రతినిధి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** రాజధానిలో హైడ్రా తరహా సంస్థ వనపర్తిలో ప్రకంపనలు మొదలయ్యాయి. గురువారం వనపర్తి లోకి అడుగుపెట్టాయన్న వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా వనపర్తి జిల్లా కేంద్రం పరిధిలో ఉన్న నాలుగు చెరువులు ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్లలో ఉన్న కొన్ని నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో నోటీసులు అందుకున్న బాధితులు తాము అన్ని అనుమతులతోనే ఇండ్లు నిర్మించుకున్నామని ఇలా నోటీసులు ఇవ్వడం సబబు కాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమకట్టడాలు కూల్చివేయాలని అధికారుల నిర్ణయించడంతో ఎఫ్ టి ఎల్ బౌండరీని గుర్తిస్తూ ఆ పరిధిలో ఉన్న నిర్మాణాలకు నోటీసులు ఇస్తుండడంతో ప్రజలు దడదడలాడిపోతున్నారు. ముఖ్యంగా వనపర్తి జిల్లా కేంద్రంలో నల్లచెరువు ,తాళ్ల చెరువు, అమ్మ చెరువు, మర్రికుంట కలిపి మొత్తం నాలుగు ఉన్నాయి. అయితే వీటి పరిధిలో చాలా ఏళ్ల క్రితమే రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేసి ప్లాట్లను విక్రయించారు. అన్ని పత్రాలు సక్రమంగా ఉండడంతో చాలామంది ఇళ్ల స్థలాలను కొని పెట్టుకున్నారు. ఎఫ్ టి ఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను హైడ్రా వంటి చర్యలు జిల్లాలకు సైతం పాకాయి దీనిలో భాగంగానే వనపర్తిలో మున్సిపల్ అధికారులు మర్రికుంట పరిధిలో ఎఫ్ టి ఎల్ బౌండరీ ని బఫర్ జోనును గుర్తించే పనిలో పడ్డారు. ఎఫ్ టి ఎల్ పరిధిలో ఉన్న అక్కడి నిర్మాణాలకు సైతం నోటీసులు జారీ చేస్తామని టౌన్ ప్లానింగ్ అధికారి కరుణాకర్ తెలిపారు.



అక్రమార్కుల ప్రహరీ గోడలను కూల్చి వేస్తున్న మున్సిపల్ అధికారులు

# నైపుణ్యం, సామర్థ్యం అవసరం..

**డిటిసిలో స్పోర్ట్స్ మీటింగ్ ముగింపు సమావేశానికి హాజరైన ఎస్పీ జానకి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** పోలీసింగ్ వ్యవస్థ అన్ని రంగాల్లో పటిష్టంగా పని చేయాలంటే శారీరక సామర్థ్యం, నైపుణ్యం ఎంతో అవసరమని మహబూబ్‌నగర్ ఎస్పీ డి. జానకి అన్నారు. జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం జడ్చర్లలో ఎస్‌సిపిసిస్, స్పోర్ట్స్, గేమ్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు రకాల ఇండోర్, ఔట్‌డోర్ గేమ్స్‌లో విజేతలుగా నిలిచిన శిక్షణా పోలీస్ కానిస్టేబుల్‌లకు బహుమతి ప్రధానం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజల మాన, ప్రాణ, ఆస్తులకు రక్షణ కల్పిస్తూ, నేరాలు, విధ్వంసాలు జరగకుండా నిరోధిస్తూ, కాపాడేందుకు రూపొందించిన వ్యవస్థే పోలీస్ వ్యవస్థ అన్నారు. పోలీసింగ్ వ్యవస్థ అన్ని రంగాల్లో పటిష్టంగా పని చేయాలంటే శారీరక సామర్థ్యం, నైపుణ్యం ఎంతో అవసరమని, అందుకు శిక్షణ ఒక్కటే సరిపోదని, క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడలు పట్టుదలను, శక్తి సామర్థ్యాలను పోటీ తత్వాన్ని, ఆనందాన్ని పెంచుతాయన్నారు. అంతే కాకుండా క్రీడలు మనిషి ఆలోచన విధానాన్ని, సాధించాలనే తపనను కూడా కలిగిస్తాయి. గెలుపు ఓటమిలను శాసిస్తూ జీవితం గమ్యాలను కూడా నిర్దేశిస్తాయి. క్రీడలు ప్రేక్షకులకు వినోదాన్ని, వారి శారీరక ఆనందాన్ని, ఆరోగ్యానికి కూడా సానుకూల ఫలితాలను ఇస్తాయి. అందుకే విద్యార్థి దశ నుండే క్రీడలను ప్రోత్సహిస్తూ, ప్రతి రంగంలోనూ క్రీడలకు ప్రాధాన్యతను – మిగతా4లో..



విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తున్న ఎస్పీ జానకి

# ట్రాఫిక్ సిబ్బందికి కిట్ల పంపిణీ



ట్రాఫిక్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ జానకి సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ వల్ల ప్రమాదాలు కాకుండా పరోక్షంగా ప్రజల ప్రాణాలను కాపాడిన వారవుతారని ట్రాఫిక్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. సిబ్బంది అందరు సమిష్టిగా కృషిచేయాలని పలు సూచనలు జారీ చేశారు. అనంతరం ట్రాఫిక్ సిబ్బందిని ట్రాఫిక్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఎస్పీ వెంకటేశ్వర్లు, వర్టికల్ డీఎస్పీసుదర్శన్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ భగవంతురెడ్డి, ట్రాఫిక్ ఎస్సై శంషుద్దిన్, సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలలు, అంగన్‌వాడిలను ఆకస్మిక తనిఖీ చేసిన ఎంపిడిఓ



పాఠశాలలను తనిఖీ చేస్తున్న ఎంపిడిఓ

**కృష్ణ, సెప్టెంబరు12 ప్రభాతవవార్త:** గుడెబల్లూరు గ్రామంలో జడ్పీహెచ్‌ఎస్, ఎంపిపిఎస్, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలను ఎంపిడిఓ జానయ్య ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. మధ్యాహ్న భోజనం బాగా వండాలని, చెడిపోయిన వాటర్ ప్యూరిఫికేషన్ సిస్టమ్‌ను రెండు రోజుల్లో బాగు చేస్తామని, బాత్రూం వసతుల కోసంపై అధికారులను సంప్రదిస్తానని, అలాగే పాఠశాల పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని ఎంపిడిఓ జానయ్య అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ జానయ్య, పంచాయతీ సెక్రెటరీ రఘు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, వంటవాళ్లు ఉన్నారు.

# పంచాయతీల నోటీస్ బోర్డుపై ఎలక్టరల్ రోల్ పెట్టాలి

**ఓటరు ఫోటోలు లేని జాబితాను మాత్రమే ముసాయిదా ఓటరు జాబితాగా ప్రకటించాలి**

**జిల్లా ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి**

**వనపర్తి ప్రతినిధి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** సెప్టెంబర్ 13న ఉదయం 10 గంటల లోపు అన్ని గ్రామ పంచాయతీల నోటీస్ బోర్డు పై ఎలక్టరల్ రోల్ పెట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి ఆదేశించారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఎలక్టరల్ షెడ్యూల్ అనుసరించి శుక్రవారం ముసాయిదా రోల్ ప్రకటించాల్సి ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని గురువారం సాయంత్రం కల్కక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి అందరూ తహశీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి షెడ్యూల్ పై అవగాహన కల్పించారు. ఓటరు ఫోటోలు లేని జాబితాను మాత్రమే ముసాయిదా ఓటరు జాబితాగా ప్రకటించాలని తెలిపారు. సెప్టెంబర్ 14 నుండి 21 వ తేదీ వరకు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదులు తీసుకోవాలని, వచ్చిన ఫిర్యాదులను సెప్టెంబర్ 26 లోపు జిల్లా పంచాయతీ అధికారి ద్వారా పరిష్కరించి సెప్టెంబర్ 28 న తుది ఓటరు జాబితా ప్రకటించాలని సూచించారు. ఎలక్టరల్ రోల్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు జిల్లా స్థాయిలో సెప్టెంబర్ 18న కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించడం జరుగుతుందని, సెప్టెంబర్ 19న మండల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించాలని సూచించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, డి.పి.ఒ సురేష్, జడ్పి సి.ఈ.ఒ యాదయ్య, ఆర్డీఓ నాగేంద్ర, సిఇ సెక్షన్ సూపరింటెండెంట్ కు కిషన్ నాయక్, తహశీల్దార్లు, ఎంపీడీఓ లు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

# సింగిల్ డోనర్ ప్లేట్ లెట్స్ మిషన్‌ను ప్రారంభించిన కలెక్టర్

**గద్వాల, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** డెంగ్యూ రోగులకు ప్లేట్‌లెట్స్ అందించే సౌకర్యం మరింత మెరుగుపరుచుటకు బ్లడ్ బ్యాంకులో సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ ఎస్‌డిపి మిషన్‌ను జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ ప్రారంభించారు. గురువారం గద్వాల ఏరియా ఆసుపత్రి బ్లడ్ బ్యాంకులో ఏర్పాటు చేసిన సింగిల్ డోనర్ ప్లేట్‌లేట్ ఎస్‌డిపి మిషన్ ను కలెక్టర్ వైద్య సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డెంగ్యూ వంటి వ్యాధులలో రోగుల ప్రాణాలను కాపాడటంలో ప్లేట్‌లెట్స్ అత్యంత కీలకమని వివరించారు. మిషన్ ద్వారా రోగులకు అత్యవసర సమయంలో ప్రాణాధారమైన ప్లేట్‌లేట్స్‌ను సమాయనికి అందించడంలో కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. డెంగ్యూ వంటి రక్త సంబంధిత వ్యాధుల కారణంగా ప్లేట్‌లెట్స్ అవసరమయ్యే సమయంలో దూరంగా ప్రయాణించాల్సిన అవసరం లేదని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ సదుపాయం అందుబాటులో ఉందని, ప్రజలందరూ అవసరమైనప్పుడు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలన్నారు. భవిష్యత్తులో మరిన్ని నూతన సాంకేతికతలు పరికరాలు అందుబాటులోకి తీసుకోస్తామని అన్నారు. వైద్యాధికారులు టెక్నీషియన్లు మిషన్ ఎలా పనిచేస్తుందో, మిషన్ యొక్క పూర్తి ప్రక్రియను కలెక్టర్‌కు వివరించారు. వైద్య – మిగతా4లో..



ప్లేట్‌లేట్స్ మిషన్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సంతోష్, పాల్గొన్న వైద్యులు

# గంగమ్మ ఒడికి గణనాథులు..

**జిల్లాలో పలుచోట్ల నిమజ్జనాలు**

**ఆకట్టుకున్న శోభాయాత్రలు**

**బందోబస్తు చర్యలు చేపట్టిన పోలీస్ యంత్రాంగం**




గణేషుని శోభయాత్రలో కోలాటం ఆడుతున్న పద్మావతి కాలనీ వాసులు

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు జిల్లాలోని పలుచోట్ల గణేష్‌లను నిమజ్జనానికి తరలించారు. ప్రత్యేక అలంకరణలతో వాహనాలను ఏర్పాటు చేసి గణేష్‌లను నిమజ్జనానికి తరలించారు. డిజె శబ్దాలతో, కోలాటాలు నృత్యాలు చేస్తూ గణేష్‌ని శోభాయాత్రతో అత్యంత వైభవంగా నిర్వహించారు. జడ్చర్లలోనూ వినాయక నిమజ్జన ఉత్సవానికి పలు మండపాల నుంచి గణేషులను తరలించారు. జడ్చర్ల నియోజకవర్గంలోని మీనాంబరం వాగు, జోగులాంబ గద్వాల జిల్లాలోని బీచుపల్లి వద్ద పెద్ద ఎత్తున నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. నిమజ్జనం చేసే దగ్గర జిల్లా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. శోభాయాత్రలోనూ ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకి ధరావత్ నిమజ్జన ఉత్సవాలకు సంబంధించి ప్రశాంతంగా జరుపుకోవాలని ఇప్పటికే ఆదేశాలను జారీ చేయగా, డిజె శబ్దాలతో ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దని సూచించారు. జడ్చర్లలో సిఐ ఆదిరెడ్డి పర్యవేక్షణలో ఎస్సైలు, పోలీస్‌లు బందోబస్తు చర్యలు చేపట్టారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి**



గ్యాస్ సబ్సిడీ ప్రొసీడింగ్‌లను అందజేస్తున్న దృశ్యం

**మక్తల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తున్నదని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ మండలంలోని కాచ్‌వార్, గోలపల్లి గ్రామాల్లో గురువారం ఆయన మహాలక్ష్మి పథకం కింద అమలు చేస్తున్న గ్యాస్ సబ్సిడీ ప్రొసీడింగ్‌లను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 గ్యారంటీల అమల్లో భాగంగా పేదలకు రూ. 500లకే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. పేదలపై భారం పడకుండా – మిగతా4లో..

## బికెఎస్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని భారతీయ కిసాన్‌సంఘ్ కార్యాలయంలో గురువారం ప్రకృతి ఆరోగ్య అవగాహన సదస్సు కరపత్రాలను భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా ఆధ్వర్యంలో విడుదల చేశారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రకృతి ఆరోగ్య అవగాహన సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. డా. నరసింహారావు విశ్వ మానవత సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటేష్, రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన జిల్లా కేంద్రంలో ఎస్ఆర్ గార్డెన్‌లో జరిగే అవగాహన సదస్సు కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పర్ణికరెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గందె అనసూయ చంద్రకాంత్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో పాటు ముఖ్య వక్తలు పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో బికెఎస్ నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు శాసమూల బాలప్ప, జిల్లా కార్యదర్శి అనంత్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రంగారెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆకుల వెంకటప్ప, పట్టణ ఉపాధ్యక్షులు తంగు విశ్వనాథ్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు యాదవ్, ఉపాధ్యక్షులు గొడుగు లక్ష్మీనారాయణ, సింగారం నరసింహులు, పగిడి మారి నరసింహారెడ్డి, బసప్పతో పాటు తదితరులు ఉన్నారు. కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

## నూతన తహసీల్దార్‌గా కార్తీక్‌కుమార్..

**వెల్దండ, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** వెల్దండ మండల నూతన తహసీల్దార్‌గా కార్తీక్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. వెల్దండ మండలంలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న రవికుమార్ కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా బదిలీపై వెళ్లారు. కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపడుతున్న కార్తీక్‌కుమర్ మండల తహసీల్దార్‌గా బదిలీపై వచ్చి రవికుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి ప్రజలు, రైతులు తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నూతన బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌ను డీటీ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరించిన కార్తీక్‌కుమార్

## యువతి, యువకులకు ఉచిత శిక్షణ

**ఉపాధికల్పనాధికారి డా.ప్రియాంక**

**గద్వాల, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** గద్వాల జిల్లాలో ప్రథమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువతి, యువకులకు 30రోజులు ఉచితంగా ఎలక్ట్రీషియన్ శిక్షణఇచ్చి ఉద్యోగఅవకాశం కల్పించడం జరుగుతుందని జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారికి ఎన్ఎస్‌డిసి సర్టిఫికేట్ అందజేయడం జరుగుతుందని, మహిళలకు ప్రాధాన్యత కల్పించడం జరుగుతుందన్నారు. పదవతరగతి, ఇంటర్, డిగ్రీ , ఎలక్ట్రీషియన్ చదివిన వారు అర్హులని తెలిపారు. వయస్సు 18నుండి 30 సంవత్సరములు వయస్సు గలవారు ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు 6303430789,9030421360 లకు సంప్రదించాలని సూచించారు.

## ఓటర్ సవరణ పూర్తి...

**వెల్దండ, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** గత 15 రోజుల నుంచి ఓటర్ సవరణపై కసరత్తు చేసి పూర్తి చేశామని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో 32 గ్రామాల్లో 270 వార్డుల్లో కుటుంబాల వారీగా ప్రతి వార్డులో వరుస క్రమంలో ఓటరు జాబితాను సిద్ధం చేశామన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలోని నోటీ సు బోర్డుపై ఓటర్ సవరణ జాబితాను ప్రచురిస్తామని, ఏమైన తప్పులు ఉంటే ఓటర్లు తమ దృష్టికి తీసుకొస్తే ఓటర్ సవరణ చేస్తామన్నారు. ఈ నెల 14 నుంచి అక్టోబర్ 1 వరకు గ్రామాల్లో స్వచ్ఛత సేవాహీ కార్యక్రమాలు నిర్వహించాలని, రోగాలు ప్రబలకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాస్, ఎంపీఓ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి

## ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక



ఖోఖో క్రీడకు ఎంపికైన క్రీడాకారులు

**మక్తల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సబ్ జూనియర్స్ ఖోఖో జట్లను గురువారం ప్రకటించారు. ఇటీవల మండలంలోని కర్నిలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపికలో ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి 300ల మంది బాల బాలికలు పాల్గొనగా, క్రీడా ప్రతిభను చాటిన 15 మంది బాలికలు, 15 మంది బాలురు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు కర్ని పాఠశాల పిడి బి.రూప తెలిపారు. రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన బాలికలు శ్రీలక్ష్మి, గీతాంజలి, నక్షత్ర (కల్వకుర్తి), శశిరేఖ, శివాని, రేవతి (కర్ని), లౌక్య, శైలజ (పెద్దపల్లి), తనుజ (కున్సి), కావేరి (నంచర్ల), ప్రణత (నారాయణపేట), పల్లవి (తూడుకుర్తి), సహస్ర (జడ్చర్ల), లిఖిత (పెద్దమందడి), స్వప్న (మరికల్) బాలుర జట్టులో శివ, తిమ్మప్ప, భీమేష్, (నవాబ్‌పేట), రాఘవేందర్, శివరాజ్, (టిఎస్‌డబ్ల్యుఆర్ఎస్) అరవింద్, నితిన్ (కర్ని), ఉమర్, అభినవ్ (జెపి నగర్), అజయ్ (మద్దూర్), నరహరి, కార్తీక్ (తూడుకుర్తి),ముసాయిద్ అహ్మద్ (కోయిల్‌కొండ), సుశాంత్ (మరికల్), సాయిరాం (పెద్దపల్లి), రాష్ట్రస్థాయికి ఎంపికైన బాల బాలికలను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఖోఖో అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, కార్యదర్శి విలియం, బాలరాజయ్య, పి.డి బి.రూప, విశ్రాంత పీఈటీ బి.గోపాలం, సామ రమేష్, చక్రవర్తి అభినందించారు.

# పుట్టిన రోజు ప్రజాసేవ... పేద ప్రజలకు శస్త్ర చికిత్సలు

**- జన హృదయ నేత అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**

**అచ్చంపేట, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** అడంబరాలతో పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న నాయకులు, నేతలు కానీ అచ్చంపేట నియోజకవర్గంలో ఇందుకు విరుద్దంగా అడంబరాలు కాదు. ప్రజల శ్రేయస్సు, ఆరోగ్య బాగోగులే ముఖ్యమని తలచిన నేత తన పుట్టిన రోజు సందర్భంగా ఏరియా ఆసుపత్రిలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు శస్త్ర చికిత్సలు నిర్వహించారు. గురువారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ జన్మదినం సందర్భంగా తన అనుచర వర్గీయులు అచ్చంపేట నియోజకవర్గంలోని 8 మండలాల్లో ఘనంగా పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. మరికొందరు నేతలు నేరుగా నియోజకవర్గ కేంద్రంలోని ఆయన స్వగృహానికి వెళ్లి శాలువా, పుష్పగుచ్ఛాన్ని అందించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఇది ఇలా ఉంటే నియోజకవర్గ కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా రక్తదానం చేసిన యువకులకు మెమెంటోలను ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఆయన సతీమణి సీబీఎం ట్రస్ట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ అందించారు. రక్తదానం చేసిన యువకులకు పండ్లు, పానీయాలను అందించారు. అనంతరం ఉమ మహేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువా, పూలమాలలతో సన్మానించారు. అదే విధంగా నిరంజన్‌షావలీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఫాతిహా కార్యక్రమంలో పాల్గొని దట్టీలను సమర్పించారు.



ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే



నిరంజన్ షా వలీ దర్గాలో ఎమ్మెల్యే దంపతులు

## కబడ్డీ పోటీలను ప్రారంభించిన కౌకుంట్ల తహసీల్దార్

**దేవరకద్ర, సెప్టెంబరు 12 ప్రభాతవవార్త :** దేవరకద్ర నియోజకవర్గంలోని కౌకుంట్ల మండల పరిధిలోని పేరూర్ గ్రామంలో యాదవ వీధి శ్రీ వినాయక మండపం దగ్గర నియోజకవర్గ స్థాయి కబడ్డి పోటీలు ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొత్త అరవింద్‌కుమార్‌రెడ్డి, కౌకుంట్ల మండల తహసిల్దార్ ఎల్లయ్య విచ్చేసి శ్రీ వినాయక మండపంలో స్వామి వారికి పూజలు నిర్వహించి కబడ్డి పోటీలకు టాస్‌వేసి మహబూబ్‌నగర్, ముత్యాలంపల్లి టీములను ప్రారంభించారు.ఈ కబడ్డి పోటీల్లో 30 టీములు పాల్గొనడం జరిగింది. ఈ కబడ్డి పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొత్త అరవింద్‌కుమార్‌రెడ్డి, తహసిల్దార్‌ను నిర్వాహకులను సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా సగర సంఘం ఉపాధ్యక్షుడు ఆర్.సి. శ్రీనివాస్‌సాగర్, బండారి శ్రీనివాస్‌సాగర్, బండారి శ్రీనివాస్ యాదవ్, బండారి బురాన్, బండారి సత్యనారాయణ, రమేష్‌గౌడ్, పి. వెంకట్‌రెడ్డి, ఆర్. శేఖర్, ఆర్. వెంకటేష్, బి. దశరథ, బి. తిరుపతి, ఆవుల ఆంజనేయులు, యుగందర్‌గౌడ్, నవ యువసేన యూత్ ఆర్గనైజర్స్ చిలుక ఆంజనేయులు సాగర్, వేముల సంజీవ్‌సాగర్, అశోక్‌యాదవ్, ఆంజనేయులు యాదవ్, మల్లేష్ యాదవ్, గ్రామ యువకులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్ ఎల్లయ్య

## పోషకా ఆహారంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**అంగన్వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమంలో సిడిపిఓ.. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ రవీందర్..**

**పెబ్బేరు సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** పెబ్బేర్ పట్టణంలోని పార్క్ ప్రాథమిక స్కూల్లో గురువారం రోజు జాతీమ పోషణ మాసం పై అంగన్వాడీ టీచర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలు వయసుకు తగ్గ బరువు ఎత్తు పెరుగుతున్నారో లేదో క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలలో బరువులు తీయడం,ఎత్తు కొలవడం కంపల్సరీ పరీక్షించుకోవాలని అదేవిధంగా బిడ్డ బరువు సాధారణ,తక్కువ బరువు, అతి తక్కువ బరువు, అనే మూడు స్థాయిలలో ఏ బిడ్డ ఏ స్థాయిలో ఉన్నారో తెలుసుకోవాలి. తక్కువ బరువు అతి తక్కువ బరువు ఉన్న ఎడల ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి సాధారణస్థితికి వచ్చేలా చూసుకోవాలని వారు తెలియజేశారు. కార్యక్రమంలో సిడిపిఓ లక్ష్మమ్మ మాట్లాడుతూ పోషక విలువలతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని గర్భిణీలు,బాలింతలు,చిన్నారుల్లో పోషక ఆహార లోపం అధికమించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పోశన్ పక్వాడ్ (పోషక మాసం) అవగాహన కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. పిల్ల, తల్లులు, గర్భిణీలు జీరో నుంచి 15 సంవత్సరాల ఆడపిల్లలు తీసుకోవాల్సిన పోషక పదార్థాలు ఆహార పదార్థాల గురించి అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు మురిపాలు తాగించడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉండటాన్ని బాలికలు కచ్చితంగా పోషక పదార్థాలను ఎక్కువ మోతాదులో తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీందర్, సిడిపిఓ లక్ష్మమ్మ,సూపర్వైజర్ ఆసియా షహీన్, లక్ష్మీ నారాయణమ్మ,పోషక అభియాన్ టీం,అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్థానిక ఎంపీడీఓ

## వంశీకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు:రంగినేని జగదీశ్వరుడు



వంశీకృష్ణ జన్మదినం సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**కొల్లాపూర్, సెప్టెంబరు12 ప్రభాతవార్త :** రాష్ట్రంలో, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి లేకున్నా పార్టీని అంటిపెట్టుకుని పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణకు కాంగ్రెస్ సీనియర్ నాయకులు రంగినేని జగదీశ్వరుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గురువారం పట్టణంలో శ్రీవాణి విద్యాలయంలో వంశీకృష్ణ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనుక్షణం ప్రజాసేవలో తరిస్తూ కాంగ్రెస్ పార్టీని అభివృద్ధి పరుస్తూ జిల్లాలో పార్టీ అత్యధిక స్థానిలు గెలుచుకోవడానికి కృషి చేసిన గొప్ప కృషీవలుడు డా. వంశీకృష్ణ అని ఆయన నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని ప్రజా సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు సహాయ సహకారాలతో జిల్లాను, రాష్ట్రాన్ని అభివృద్ధి పరచాలని ఆకాంక్షించారు. అనంతరం బాల బాలికలకు చాక్లెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జమీల్‌ఖాన్, జావేద్, రంగినేని జగదీశ్వరుడు, జగ్గుసార్, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌ఎంపికైన సరస్వతీ పాఠశాల విద్యార్థులు

**ఇటిక్యాల సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** సౌత్ జోన్ అథ్లెటిక్స్ క్రీడలకు అండర్ 14 అండర్ 17 కు మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలోని సరస్వతి టెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎన్నికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అథ్లెటిక్స్ అండర్ 14 మరియు 17 సీబీఎస్ఈ క్లస్టర్ 7 సౌత్ జోన్ అథ్లెటిక్స్ కు ఎంపికైన ఎర్రవల్లి సరస్వతి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు. ఈ నెల 13వ తేదీ నుండి 17వ తేదీ వరకు అథ్లెటిక్స్ అండర్ 14 అండర్ 17 కు ప్రాతినిధ్యం వహిస్తున్న నల్గొండ జిల్లాలోని ఏకశిలా అడ్వాన్స్ లర్నింగ్ స్కూల్ నందు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ అండర్ 14 అండర్ 17 కు వెళ్లే విద్యార్థులు కాంపిటీషన్స్ అన్నింటిలో ఉత్తమ ప్రదర్శన చేయాలని కోరారు. ఎంపికైన అండర్ 14 ఎంపికైన 7వ తరగతికి చెందిన మనోజ్ కుమార్ అండర్ 17 కు ఎంపికైన విద్యార్థులు 10వ తరగతికి చెందిన విద్యార్థులు నవనీత్, వినయ్, లోకేష్, 9వ తరగతికి చెందిన విద్యార్థులు శివ, ఎండి, ఇర్ఫాన్, దిలీప్‌గౌడ్, వెంకటసాయి, చైతన్యలు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులందరికి పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కరస్పాండెంట్, మధులికరెడ్డి, ప్రిన్సిపాల్ నందిని, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు అభినందనలు తెలిపారు.




ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్ నందిని

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల దుస్థితి



మొరం మోస్తున్న విద్యార్థులు

**ఉట్కూర్, సెప్టెంబరు12 ప్రభాతవవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులతో మొరం మోయిస్తున్నారు. మండల విద్యాశాఖ అధికారి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఈవిషయమై కుసుమ ప్రధానోపాధ్యాయురాలును వివరణ కోరగా టీచర్లతో పాటు విద్యార్థులు కూడా పని చేశారని అక్కడ మొరం ఉండడం వల్ల దోమలు నిలిచిపోయి కలుషితమైందని అందుకోసం మొరం మొత్తం అందరి కలిసి పాఠశాల ఆవరణలో వేశామని తెలిపారు.

## ధర్నాను జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేసిన దృశ్యం

**ఉట్కూర్, సెప్టెంబరు 12 ప్రభాతవవార్త :** మండల పరిధిలోని నిడుగుర్తి గ్రామంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీలో భాగంగా వారు మాట్లాడుతూ నేడు శుక్రవారం జరిగే రైతుల రుణమాఫీ ప్రక్రియను షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని రైతు భరోసా డబ్బులను వెంటనే ఇవ్వాలని, నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాల్సిందిగా కరపత్రాలను విడుదల చేశారు.కార్యక్రమంలో సిపిఎంనాయకులు శంకర్,రైతులు బాలరాజు, చంద్రప్ప, ఆంజనేయులు, ఉప్పరి రాజు, బుగ్గప్ప పాల్గొన్నారు.

## 8వ రోజుకు చేరిన దీక్ష



రిలే దీక్షలో పాల్గొన్న దళితులు

**కృష్ణ, సెప్టెంబరు 12 ప్రభాతవవార్త :** గతనెల 18న ముడుమాల్ గ్రామంలో దళితుల పెళ్లిని గుడిలో జరగకుండా అడ్డుకున్న పూజారి చక్రపాణిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడాన్ని వ్యతిరేకిస్తూ చేస్తున్న రిలే దీక్షలు గురువారానికి 8వ రోజుకు చేరాయి. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్, ఎమ్మార్పీఎస్ నాయకులు నాగేష్, కెఎన్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, హిందూపూర్, ముడుమాల్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**వెల్దండ, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** మండలంలోని కుప్పగండ్ల గ్రామానికి చెందిన గోరటి కిష్టమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న సింగిల్‌విండో డైరెక్టర్ మొక్తాల శేఖర్ మృతురాలు కిష్టమ్మ కుటుంబాన్ని పరామర్శించి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి తన వంతుగా రూ.3వేల ఆర్థిక సహాయం అందించి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటయ్యగౌడ్, శ్రీనుయాదవ్, గోరటి బుచ్చయ్య, వెంకటయ్య, రఘుపతి, శ్రీశైలం, కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు అభినందన

**మక్తల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మక్తల్ మండలం కర్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి మొత్తం పదిమంది బాల బాలికలు ఎంపికైనట్లు జిహెచ్‌ఎం వెంకటయ్యగౌడ్ పిడి బి.రూప తెలిపారు. బాలికల విభాగంలో ఎన్.శివాని, రేణుక, శశిరేఖ, బాలుర విభాగంలో అరవింద్, నితిన్‌లు ఎంపికయ్యారన్నారు. వీరు నెల 14న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారిని పాఠశాల ఆవరణలో శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు.



# నేషనల్ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** సుప్రీం కోర్టు ఉత్తర్వులు, రాష్ట్ర హైకోర్టు సూచనలు మేరకు ఈ నెల 28న 7వ జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు తెలిపారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవ సధన్ భవనంలో ఈ నెల 28న జిల్లాలో నిర్వహించే 7వ జాతీయ లోక్ అదాలత్ నిర్వహణపై న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జీ సబితతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేష్‌బాబు మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని వివిధ కోర్టుల్లో అనేకమైన కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, కోర్టులో వేయని వివాద కేసులు ఉంటే అవి కూడా ముందస్తు ఫిటిషన్స్ ఫిర్యాదుగా స్వీకరించి సమన్యాయం అందించుటకు ఈ లోక్ అదాలత్ మంచి పాత్రను పోషిస్తుందన్నారు. జిల్లాఓని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, కల్వకుర్తి కోర్టుల్లో ఈ నెల 18 నుంచి ఈ నెల 28 జాతీయ లోక్ అదాలత్ వరకు ప్రతి రోజు ఉదయం 9 గంటలకు న్యాయమూర్తులు అందుబాటులో ఉంటారని, కక్ష్యిదారులు కలిసేలా ప్రత్యేకంగా ఈ సమయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సారి కొత్తగా సుప్రీంకోర్టు తీసుకొచ్చిన నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు లో ఉన్న తగాదాలను సైతం ఇరుపక్షాల వారు తమ న్యాయవాదులతో జిల్లా న్యాయస్థానంలో నిర్వహించే లోక్ అదాలత్‌లో సంప్రదిస్తే అట్టి కేసు పూర్వపరాలను పరిశీలించి రాష్ట్ర హైకోర్టుకు సమర్పించడం ద్వారా కక్ష్యిదారులు ఢిల్లీకి వెళ్లాల్సిన అవసరం లేకుండా కేసుల పరిష్కారం జరుగుతుందని, ఈ అవకాశాన్ని కొత్తగా తీసుకొని రావడం జరిగిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 28న నిర్వహించే 7 లోక్ అదాలత్‌తో న్యాయమూర్తులు, న్యాయవాదులు, రెవెన్యూ, పోలీస్, బ్యాంక్ అధికారులు, చిట్‌ఫండ్ కంపెనీలు, భీమా సంస్థ ప్రతినిధులు, కక్ష్యిదారులు పాల్గొని జిల్లాలో ఎక్కువ కేసులు పరిష్కరించి నాగర్‌కర్నూల్ జిల్లాను రాష్ట్ర స్థాయిలో ఉత్తమ స్థానంలో ఉండేలా సహకరించాలని జిల్లా జడ్జీ డి.రాజేష్‌బాబు కోరారు. కక్ష్యిదారులు, సివిల్, క్రిమినల్ ఫ్యామిలీ మోటార్ వెహికల్ విద్యుత్‌తో పాటు అన్ని రకాల కేసులను సత్వరం పరిష్కరించుకోవచ్చునని సూచించారు. సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ కేసులను సైతం పరిష్కరిస్తామన్నారు. లోక్ అదాలత్‌తో పరిష్కరించే కేసులు అప్పీల్‌కు వెళ్లే అవకాశం కూడా ఉండదన్నారు. కక్ష్యిదారులు కేసుల కోసం మళ్లీ కోర్టుల చుట్టు తిరగకుండా శాశ్వతంగా పరిష్కారం లభిస్తుందని జిల్లా జడ్జీ న్యాయమూర్తి తెలిపారు.



జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రాజేష్‌బాబు

# ఘనంగా వినాయక నిమజ్జనం

◆ కోలాటాలు, భజనలు, బొడ్డెమ్మల ఆటపాటలతో భారీ ఊరేగింపు





యూనియన్ బ్యాంకుకు సమీపంలో ప్రతిష్టించిన వినాయక విగ్రహ ఊరేగింపు దృశ్యం

**భూత్పూర్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:** భూత్పూర్‌లో గత ఐదు రోజులుగా అలరించిన విఘ్నేశ్వర విగ్రహాలను నిర్వాహకులు గురువారం నిమజ్జనం నిర్వ హించారు. కోలాటాలు, భజనలు, బొడ్డెమ్మల ఆటపాటల నడుమ, భక్తుల కోలాహలం మధ్య నిమజ్జనానికి భారీ ఊరేగింపు జరిగింది. పట్టణంలోని పదో వార్డు లో కొలువుదీరిన అంబేద్కర్ యువజన సంఘం సభ్యులచే ప్రతిష్టించిన వినాయక విగ్రహం, మున్సిపాలిటీ కార్యాలయానికి సమీపంలో ముదిరాజ్‌లు ప్రతి ష్టించిన వినాయక విగ్రహం, నాగర్‌కర్నూల్ రోడ్‌లో ప్రతిష్టించిన భారీ వినాయకుడు, నాల్గొవార్డు ఎస్సీ కాలనీలో ప్రతిష్టించిన వినాయక విగ్రహం నిమజ్జనానికి తరలాయి. రంగురంగుల విద్యుత్ కాంతుల నడుమ, విభిన్న పుష్పాలంకరణలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన చూడ ముచ్చటగొలిపే వినా యకుల్ని దర్శించు కునేందుకు భక్తులు, ప్రజలు వేల సంఖ్యలో తరలివచ్చారు. భూత్పూర్ పట్టణ నడిబొడ్డున ఉన్నశ్రీఅంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయ భక్త కమిటీ సభ్యులచే ప్రతిష్టించిన వినాయక విగ్రహం, ఊరేగింపు నాగర్‌కర్నూల్ రోడ్, మహబూబ్‌నగర్ రోడ్‌లోని యూనియన్ బ్యాంక్ కు సమీపంలో ప్రతిష్టించిన వినాయక విగ్రహం, మున్సిపాలిటీ రోడ్, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, ఇందిరానగర్ కాలనీ, భూత్పూర్ చౌరస్తాల మీదుగా ట్రాక్టర్లు, ట్రాలీలు, డీసీఎంలు, ఆటోలు, లారీలలో వినాయక మూర్తులను ఊరేగించారు. వినాయక విగ్రహాల ఊరేగింపలో ఉత్సవ కమిటీ నిర్వహకులు అక్కడక్కడా భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణగావించారు. వినాయక విగ్రహాల వద్ద నిర్వహకులు లడ్డూ వేలం నిర్వహించారు.



పుట్టపల్లిలో వినాయకుడికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

**దేవరకద్ర, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం పుట్టపల్లిలో బుదవారం రాత్రి వినాయకుడ్ని నిమజ్జనం చేశారు. దాదాపు 5 రోజులపాటు ప్రత్యేక పూజల అనంతన వినాయకుడ్ని నిమజ్జనం చేశారు. నిమజ్జనం సందర్భంగా గ్రామస్థులు వినాయకుడికి పలు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డూ వేలం పాట నిర్వహించారు. లడ్డూను రూ.54కు పాటపాడి గ్రామస్థుడు సేరి రవీందర్‌రెడ్డి కైవస ం చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



**డోకూరు తపోవన్ పాఠశాలలో:** దేవరకద్ర మండలం డోకూరు తపోవన్ పాఠశాలలో ప్రతిష్టించిన వినాయకుడ్ని గురువారం నిమజ్జని చేశారు. పాఠశాల ప్రిన్సిపల్ వర్కుటి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో వినాయకుడికి నిమజ్జనం సందర్భంగా పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దాదాపు ఐదు రోజుల పాటు వినాయకుడికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూజలు నిర్వహించారు. అనంతరం సమీపంలోని చెరువులో వినాకుడ్ని నిమజ్జనం చేశారు.

## బాల కార్మికుల చట్టాలపై విద్యార్థులకు అవగాహన



బాలకార్మిక చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**ఇటిక్యాల సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొండేరులోని పాఠశాలలోని మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ లీగల్ అధికారి శివ హాజరై మాట్లాడుతూ బాలలకు ఎదురయ్యే సమస్యలు, బడి బయట పిల్లలు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలల చట్టాలపై అవగాహన కల్పించి, బాలలపై ఎలాంటి వేదింపులు జరగకుండా చూసు కోవాల్సిన బాధ్యత గ్రామ కమిటీ సభ్యులకు ఉంటుందని వివరించారు. అలాగే ఆపదలో ఉన్న బాల బాలికలు బాలల నేస్తం అయినా టోల్ ఫ్రీ నెంబర్ 1098 కి కాల్ చేయాలని సూచించారు. అంతేకాక, గ్రామంలో ఎవరైనా అనాధపిల్లలు ఉంటే కూడా మాదృష్టికి తీసుకు రావాలన్నారు. 0 నుండి 18 సంవ త్సరాలలోపు బాలబాలికలు అందరికి ఎలాంటి సమస్య వచ్చినా 1098, 100 టోల్ ఫ్రీ నెంబర్ కాల్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ సోషల్ వర్కర్ లక్ష్మి, పాఠశాల ఇంచార్జి హెచ్‌ఎం రాజగోపాల్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ రావు, అంగన్‌వాడి టీచర్ నాగరాణి, సులోమని, తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపానికి భూమి పూజ



వినాయక మండపానికి భూమి పూజ చేస్తున్న మాజీ సర్పంచ్ వరలక్ష్మిపంతులనాయక్

**వెల్దండ, సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** వెల్దండ మండలం దుబ్బతాండలో వినాయక మండప నిర్మాణానికి మాజీ సర్పంచ్ వరలక్ష్మి పంతుల నాయక్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ వరలక్ష్మిపంతుల నాయక్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల్లో భాగంగా యువజన సంఘం సభ్యులకు ఇచ్చిన హామీ మేరకు రూ.1లక్షతో గణేష్ మండపాన్ని నిర్మించి వచ్చే వినాయక చవితి ప్రతిష్టకు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వినాయక మండప ఏర్పాటుకు భూమి పూజ చేసిన మాజీ సర్పంచ్ వరలక్ష్మిపంతులనాయక్‌ను యువజన సంఘంసభ్యులు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు సేవ్యనాయక్, గోపాల్‌నాయక్, రేఖ్యానాయక్, మున్నానాయక్, వెంకట్రామ్, శ్రీను, రమేష్, సురేష్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

## గణపతులకు ఘనంగా పూజలు



వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

**దేవరకద్ర, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** మండలంలో ప్రతిష్టించిన వినాయక మండపాల వద్ద గురువారం వినాయకులకు భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. స్థానిక శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రతిష్టించిన వినాయకుడికి అర్చకుడు హరిశంకర శర్మ ఆధ్వర్యంలో భక్తులు పూజలు నిర్వహించారు. అలాగే తీగలప్ప కట్ట, కురువవాడ, దళితవాడ తెలుగు వాడలలో ప్రతిష్టించిన వినాయకుల మండపాల వద్ద కూడా భక్తులు పూజలు నిర్వహించారు. విశేష గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆయా వాడలలో ప్రతిష్టించిన వినాయక మండపాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు.

## బీజేపి జిల్లా యువమోర్చా ప్రధానకార్యదర్శిగా గజ్జలరాము

**దేవరకద్ర, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** బీజేపి మహబూబ్‌నగర్ జిల్లా యువమోర్చా ప్రధాన కార్యదర్శిగా చిన్నచింతకుంట మండలానికి చెందిన గజ్జలరామును గురువారం పార్టీ నియమించింది. ఈ సందర్భంగా దేవరకద్రలో గురువారం ఏర్పాటు చేసిన ఒసమావేశంలోఆ పార్టీ మండల దేవరకద్ర నియోజకవర్గ ఇంచార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ పటిష్ఠతకు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణంరాజు, నాయకులు హోటల్ అంజనేయులు, నట్టలి అంజనేయులు, యువనాయకులు నరేందర్, నరేశ్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టం అవగాహన కరపత్రాలు విడుదల

**మాగనూరు, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎలిగండ్ల వెంకటేష్ ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు పతంగి చిన్నయ్య, మక్తల్ అసెంబ్లీ అధ్యక్షులు మ్యాతరి గోపాల్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 30న సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటి తరపున నిర్వహించబోయే సమాచార హక్కు చట్టం 2005 అవగాహన సదస్సుకు సంబంధించిన కరపత్రాలను మాగనూరు తహసిల్దార్ సురేష్ విడుదల చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ నాయకులు మందకృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేసిన దృశ్యం

# రుణమాఫీ కానీ రైతులు ఫ్యామిలీ గ్రూపింగ్ చేసుకోవాలి

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** వ్యవసాయ రుణ మాఫీ కానీ అర్హులైన రైతులు మండల వ్యవసాయ అధికారిని సంప్రదించి తమ ఫ్యామిలీ గ్రూపింగ్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేడోక ప్రకటనలో తెలిపారు. కొంత మంది అర్హులైన వ్యవసాయ రైతులకు వివిధ కారాణాల వల్ల రుణ మాఫీ కాలేదని ఎలాంటి రైతులు తప్పని సరిగా తన ఫ్యామిటీ గ్రూపింగ్ ఆన్లైన్ ద్వారా చేయించుకోవాలని అప్పుడే రుణమాఫీ వస్తుంద న్నారు. మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి తమ వద్ద ఉన్నఆధారాలను చూపించి ఆన్లైన్ నమోదు చేసుకోవాలని కోరారు. వచ్చే నాలుగు అయిదు రోజుల్లో ఆన్లైన్ చేయించుకోవాలని, రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# విద్యతో పాటు దేహదారుఢ్యం ముఖ్యం

◆ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



శిథిలావస్థలో ఉన్న తరగతి గదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

**గోపాల్‌పేట సెప్టెంబర్12 ప్రభాతవార్త:** విద్యార్థులకు విద్యతో పాటు దేహదారుఢ్యం ఎంతో ముఖ్యమని దేహ దారుఢ్యం క్రీడలతో సాధ్యమవవుతుందని ,విద్యార్థులు క్రీడలపై దృష్టిని సారించాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచించారు. గోపాల్‌పేట మండలం బుద్ధారం గ్రామ ఉన్నత పాఠశాలలో అన్ని గదులు శిథిలావస్థలో ఉన్నాయని వాటిని వెంటనే తొలగించి నూతన తరగతి గదుల నిర్మాణాలకు కావలసిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు, అందుకు సానుకులంగా స్పందించిన కలెక్టర్ శిథిలావస్థలో ఉన్న గదుల ను తొలగించేందుకు వెంటనే చర్యలు చేపడుతామని తెలిపినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా ప్రగతిని తెలుసుకున్నారు. విద్యార్థులు ఈ దశ నుంచే క్రమ శిక్షణ అలవర్చుకుంటేభవిష్యత్తు మార్గాలు సుగమనం అవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు అచ్యుతరామారావు, సత్యశీలరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిఆర్‌టియు తెలంగాణ మూసాపేట మండల కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గాన్ని ఎన్నుకున్న దృశ్యం

**మూసాపేట, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** మండల పిఆర్‌టియు తెలంగాణ మండల నూతన కార్యవర్గాన్ని మండల కేంద్రంలో గురువారం ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికల కార్యక్రమానికి టిఆర్‌టియు తెలంగాణ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాకాంత్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఎన్నికల మండల ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పిఆర్‌టియు మండల అధ్యక్షుడిగా కృష్ణ, మహరాజ్ మండల ప్రధాన కార్యదర్శిగా సురేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన కృష్ణమహరాజ్ సురేష్‌మాట్లాడుతూ గాల్‌రెడ్డి హర్షవంధన్‌రెడ్డి నేతృత్వంలో పని చేస్తున్న పిఆర్‌టియు తెలంగాణ సంఘం ద్వారా మండలంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఎన్నికల కార్యక్రమంలో సహకరించిన ఉపాధ్యాయులందరికి కృతజ్ఞతలుతెలిపారు. కార్యక్రమానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమాకాంత్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

## విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీల ఏర్పాటు

**ఖిల్లాఘణపురం సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** మండల పరిధిలోని అన్ని గ్రామాలలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని విశ్వ హిందూ పరిషత్ మండల అధ్యక్షులు గాండ్ల రాములన్నారు. గురువారం మండల కేంద్రంలోని బెస్తగిరి లో ఉన్న గంగమ్మ తల్లి దేవాలయం ఆవరణలో విశ్వ హిందూ పరిషత్ మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామాలలో విశ్వ హిందూ పరిషత్ గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి గ్రామాలలో ఉన్న హిందువులనుజాగృతం చేయాలన్నారు. అన్ని పార్టీలకు అతీతంగా హిందూ బంధువులందరూ ఒకే వేదిక పైకి వచ్చే విధంగా గ్రామ కమీటీల వారు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో హిందువులంతా తమసాంప్రదాయాలను పాటించే విధంగా చైతన్య పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు విక్రమ్, బెస్త శ్రీనివాసులు, బురాన్, శీను, సుంకరి, ఆంజనేయులు, బండారి యాదయ్య పలు గ్రామాలకు చెందిన యువకులు పెద్దలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు కంటి పరీక్షలు

**భూత్పూర్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:** భూత్పూర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధ్వర్యంలో గురువారం వైద్యులు, వైద్యసిబ్బంది మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. పిల్లల్లో సరైన ఎదుగుదలను పరీక్షించారు. పట్టణంలోని గోప్లాపూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో పోషణ్ మాసం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలతో పాటు బరువు, ఎదుగుదల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ ఎంఓ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్, సీహెచ్‌ఓ అయూబ్‌ఖాన్‌తో పాటు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీం సుల్తానా, బాలీశ్వరమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌లో మగబిడ్డకు జన్మనిచ్చిన తల్లి



మగ బిడ్డకు జన్మనిచ్చిన తల్లితో 108 సిబ్బంది

**పెబ్బేరు సెప్టెంబర్12 ప్రభాతవార్త :** పెబ్బేరు మండలం రాంపురం గ్రామానికి చెందిన ఉషన్ బీకి పురిటి నొప్పులు రాగా 108 సమాచారం ఇచ్చారు. కడుకుంట్ల అంబులెన్స్ వాలు హాస్పిటల్ తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికము అయిఆమె అంబులెన్స్‌సిబ్బంది సోమనాతి శశిపైలట్ మైనోద్దీన్ ఆశాకార్యకర్త నశ్రీమ్ బేగం తెలిపారు. డెలివరీకి సహకరించిన108 సిబ్బందికి రాంపురం గ్రామస్తులు అభినందించారు. ప్రస్తుతం వారిని పెబ్బేర్ ప్రాథమిక వైద్యాశాలలోఅడ్మిట్ చేశారు. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.

## మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారానికి తరలిరావాలి

**ఇటిక్యాల సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:** అల్లంపూర్ మార్కెట్ యార్డ్ నూతన చైర్మన్ గా దొడ్డన్న వైస్ చైర్మన్ గా కుమార్ వీరితోపాటు 12 మంది డైరెక్టర్లు శుక్రవారం అలంపూర్ చౌరస్తాలోని మార్కెట్ యార్డ్‌లో ఉదయం 10 గంటలకు పదవి ప్రమాణస్వీకారం నిర్వహిస్తుండగా ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇంచార్జ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి. ఏఐసీసీ కార్యదర్శి అల్లంపూర్ మాజీ ఎమ్మెల్యే హాజరుకానున్నారని మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ దొడ్డన్న వైస్ చైర్మన్ కుమార్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ అల్లంపూర్ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాజీ సర్పంచ్ జోగుల రవి తెలిపారు. ప్రమాణ స్వీకారకార్యక్రమానికి అలంపూర్ నియోజకవర్గంలోని 8 మండలాల నుండి మాజీ జెడ్పిటిసిలు మాజీ ఎంపీపీలుమాజీ ఎంపీటీసీలుమాజీ సర్పంచులు అలాగే అలంపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ మహిళా కమిటీ నాయకులు అలంపూర్ నియోజకవర్గ రైతులు నాయకులు పెద్ద సంఖ్యంలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.

## జి.కృష్ణారెడ్డికి ఘన నివాళి

■ దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు, చక్రాపూర్ గ్రామస్తులు



కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

**మూసాపేట, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి జిఎంఆర్ తండ్రి కీ॥శే॥ జి. కృష్ణారెడ్డి గత వారం మరణించిన విషయం తెలుసుకుని గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శెట్టి చంద్రశేఖర్ చక్రాపూర్ గ్రామస్తులు ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి వారి నివాసంలో కలిసి స్వర్గీయ కీ.శే. కృష్ణారెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. జిఎంఆర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు గోరకొండ ఆంజనేయులు, యూత్ అధ్యక్షులు గంటెల బ్రహ్మయ్య, పెద్దలులక్ష్మారెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, ఎల్లప్ప, చిన్న చందయ్య, ఉప్పరి యాదయ్య, ఆంజనేయులుగౌడ్, ఇస్రంపల్లి తిరుపతయ్య, భగవంతు, గురకొండ వెంకటయ్య, శ్రీశైలం, కందూరి తిరుపతయ్య పాల్గొన్నారు.



**పెబ్బేరు సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి తండ్రికీ.శేకృష్ణరెడ్డి గతవారం స్వర్గస్తులయ్యారు, గురువారం వారి వెళ్లి పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, పరమర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీన జరిగే తన తండ్రి దశదిన కర్మ ఖండలకు హాజరువ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు రంజిత్ కుమార్, తోమలపల్లి మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్, మండల రైతు కమిటీ అధ్యక్షులుజగదీశ్వర్‌రెడ్డి, మండల సీనియర్‌నాయకులు దయాకర్ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, సత్యానారాయణ రెడడ్డి శివసాయి ,మల్లేష్, వినయ్, ప్రఫుల్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్త తలారి సంజీవులు మృతి

**చిన్నంబావి, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొప్పునూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త తలారిసంజీవులు మృతి పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొప్పునూరు మాజీ సర్పంచ్ బీచుపల్లి యాదవ్, కొత్త కళ్యాణ్‌రావు, మాజీ జడ్పీటిసి కృష్ణ ప్రసాద్ యాదవ్, రామ చంద్రారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్‌లు అన్నారు. గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం కృషి చేస్తూ ఎంపి మల్లురవికి, మంత్రి జూపల్లి కృష్ణారావుకు సన్నిహితులుగా మెలిగి పార్టీ కోసం కృషి చేసిన తలారి సంజీవులు మృతి తీరంలోనిఆయన మృతికి పార్టీ తరపున సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం తరపున అండగా నిలుస్తాయని వారన్నారు.

## జన విజ్ఞాన వేదిక మండల కమిటీ ఎన్నిక

**చిన్నంబావి, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** సైన్స్ స్వచ్ఛంద సంస్థ జన విజ్ఞాన వేదిక (జెవివి) 2024,25 సంవత్సరం చిన్నంబావి నూతన మండల కమిటిని రాష్ట్ర కమిటి ఆదేశాల మేరకు మోటివేషనల్ ట్రైనర్ సిహెచ్ వెంకటేష్ ఆధ్వర్యంలో కమిటి ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడుగా (జెవివి) సిహెచ్ వెంకటేష్, ఉపాధ్యక్షుడు కె.రాము, సెక్రెటరీ ఎం.రాజ్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ ఎం.వెంకట కృష్ణారెడ్డి, చెక్‌ముకి కన్వీనర్ జి. శ్రీకాంత్, ట్రెజరీగా నాగేష్, సభ్యులుగా లింగస్వామి, బి. శ్రీనివాసులు, వెంకటేష్, కె. నర్సింగరావులతో పాటు మొత్తం 9 మంది సభ్యులతో కూడుకున్నటువంటి సైన్స్ ఆర్గనైజేషన్ (జెవివి) చిన్నంబావి మండల నూతన కమిటి ఎన్నికయ్యారు. వారు మాట్లాడుతూ సంపూర్ణ సైన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తామని (జెవివి) అధ్యక్షుడు సిహెచ్ వెంకటేష్ తెలియజేశారు.

## ఇసుక టిప్పర్ పట్టివేత : కేసు నమోదు

**ఇటిక్యాల సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** అక్రమంగా ఇసుకను అనుమతులు లేకుండా తరలిస్తున్న మినీ టిప్పర్ ను పట్టుకుని కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని సాతర్ల గ్రామశివారులో గురువారం తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో బ్లూ కోస్టు పోలీసులు శ్రీను, మునవర్ పాష విధులు నిర్వహిస్తుండగా అక్రమంగా అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న టీఎస్ 33 టి 5953, నెంబర్ గల మినీ టిప్పర్ ఆపి పోలీసులు విచారించగా అనుమతులు లేకుండా ఇసుకను తరలించడంతో ఇటిక్యాల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ కానిస్టేబుల్ శ్రీను ఫిర్యాదు మేరకు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేశ్ కేసు నమోదు చేశారు.

## ధర్నాకు తరలిరండి



కరపత్రాలు విడుదల చేసిన దృశ్యం

**మక్తల్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రైతు రుణ మాఫీ, రైతు భరోసా విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించే ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు గోవిందరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండలంలోని దాసర్‌దొడ్డి, వనాయికుంట, తిరుమలాపూర్, చందాపూర్ గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించి, రైతులకు ధర్నాకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు లక్ష్మణ్, రవి, తమ్మిరెడ్డి, శివ, వెంకటేష్, ఆంజనేయులు, కురుమయ్య పాల్గొన్నారు.

## నిమజ్జనం కోసం స్థలపరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**దేవరకద్ర, సెప్టెంబరు12 ప్రభాతవార్త:** దేవరకద్రలో గురువారం వినాయకుల నిమజ్జనం కోసం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ప్రతి ఏడాది స్థానిక పెద్ద చెరువులో వినాయకులను నిమజ్జనం చేస్తారు. అందులో భాగంగానే ఏడాది వినాయకుల నిమజ్జనం కోసం స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఈ నెల 15న వినాయకులను దేవరకద్రలో నిమజ్జనం చేయనున్నారుఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగన్న, యంపిడిఓ శ్రీనివాస్‌రావు, ఈఓసీత్యనాయక్, వెంకట్రాములు పాల్గొన్నారు.

## రూ.1809 ధర పలికిన కింటాల్ హంస

**దేవరకద్ర, సెప్టెంబరు12 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం రైతులు 10 కింటాళ్ళ హంస ధాన్యాన్ని విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా కింటాల్‌కురూ.1809ధర పలికింది. అతితక్కువగా రూ.1701 ధర పలికింది. అలాగే 2 కింటాళ్ళ ఆముదాలను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు. వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ.5600 ధరపలికింది. అలాగే అతి తక్కువగా కూడ అంతే ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

## డోలారోహణ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపిపి కదిరే


**భూత్పూర్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:** భూత్పూర్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు కదిరే శేఖర్‌రెడ్డి గురువారం భూత్పూర్ మండలం కప్పెట గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త మల్లేష్ కుమారుడి డోలారోహణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి వేణు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే జీఎంఆర్‌ను పరామర్శించిన భూత్పూర్ విలేకరులు



**భూత్పూర్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త:** దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) తండ్రి జికృష్ణారెడ్డి గతవారం మృతి చెందగా, గురువారం భూత్పూర్ విలేకరులు ఎమ్మెల్యే జీఎంఆర్‌ను స్వయంగా కలుసుకుని ఆయన తండ్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో గొడుగు వేదాంతం వెంకటయ్య (వార్త), శంకర్ నాయక్ (ఆంధ్రజ్యోతి), బి వెంకటేశ్వర్‌రావు(సాక్షి), అర్వ విజయ్‌కుమాం (ఆంధ్రప్రభ), జహంగీర్(మాభూమి) పాల్గొన్నారు.

## బాల బాలికలకు పోషకాహారం అందించాలి



పోషకాహారాల గురించి వివరిస్తున్న ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్రీలత

**ఆత్మకూర్ సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** చిన్నారి బాల బాలికలకు పోషకాహారం అందించడమే లక్ష్యంగా అంగన్వాడీ టీచర్లు పనిచేయాలని ఆత్మకూర్ ప్రాజెక్టు ఐసిడిఎస్ అధికారి సూపర్వైజర్ శ్రీలత వెల్లడించారు. పోషణ మాసం కార్యక్రమాన్ని పురస్కరించుకొని గురువారం రోజు ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామంలో గల అంగన్వాడీ కార్యాలయం నందు పోషణ మాసం గురించి గర్భిణీలకు బాలింతలకు అందించాల్సిన పోషకాహారాల గురించి అంగన్వాడీ టీచర్లకు ఆయాలకు సవివరంగా వివరించారు. గర్భిణీ స్త్రీలకు కిశోర తల్లులకు మాంస కృతులు చిరుధాన్యాల గురించి ప్రతి ఒక్క అంగన్వాడీ టీచర్ వారికి ఇంటికి వెళ్లి వివరించాల్సిన అవసరం ఎంతైనాఉందని ఆమె తెలిపారు. భవిష్యత్తులో బాల బాలికలు ఆరోగ్యకరమైన జీవితం గడిపేందుకు అంగన్వాడీ టీచర్ల ప్రమేయం ఎంతైనా ఉందని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సంధ్యారాణి ,నాజియా బేగం, స్వర్ణలతతదితరులతో పాటుగా ఆయాలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలను నివారించాలి

◆రోడ్డు భద్రత జిల్లా స్థాయి సమావేశంలో మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్రబోయి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రబోయి

**మహబూబ్‌నగర్‌బ్యూరో, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం ఐడిఓసిలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల విషయంలో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత జిల్లా స్థాయి సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది అత్యంత ప్రాధాన్యమైనదని, మానవ తప్పిదాల వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఈ రోడ్డు ప్రమాదాలలో 18 నుండి 45 సంవత్సరాల లోపు ఉన్నవారు ఎక్కువగా చనిపోతున్నారని, వీటిని నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నేషనల్ హైవే 44,167, స్టేట్ హైవే 20పై పోలీస్‌శాఖ అధికారుల ద్వారా కనుగొన్న బ్లైండ్ స్పాట్ల వద్ద రేడియం స్టికర్లతో కూడిన సూచికలను ఏర్పాటు చేయాలని, రహదారులపై వాహన వేగాన్ని నియంత్రించే స్పీడ్ బ్రేకర్స్‌ను అవసరమైన చోట ఏర్పాటు చేయాలని, తమ వాహనము ఎంతో వేగంతో వెళ్తున్నది వాహన చోదకున్ని అలర్ట్ చేసేలా రోడ్లపై వేగాన్ని సూచించేడిజిటల్ బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. వాహనదారులు రహదారిపై వచ్చే వాహనాలకు ఎదురుగా వెళ్లకుండా అవసరమైన చోట సర్వీస్ రోడ్లను నిర్మించేందుకు సంబంధిత శాఖ ద్వారా ప్రతిపానదలు సిద్ధం చేయాలని అన్నారు. పోలీస్ శాఖ ద్వారా కనుగొన్న బ్లైండ్ స్పాట్లను పోలీస్ శాఖ, రవాణా శాఖ మరోసారి ఆ స్థలాలను పరిశీలించాలని ఆమె ఆదేశించారు. సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ జానకి, స్థానిక సంస్థలఅదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అడిషనల్ ఎస్పీ రాములు, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, రవాణాశాఖ అధికారి, మహబూబ్‌నగర్‌డీఎస్పీ, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బి ఈఈ, ఎల్‌అండ్‌టి, ఆయా సంస్థల అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలి

◆సనాతన ధర్మాన్ని విమర్శించే స్థాయి రాహుల్ గాంధీకి లేదు ◆బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,బంగ్లా లక్ష్మీ కాంతరెడ్డి


మాట్లాడుతున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీకాంత రెడ్డి

**అమరచింత సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బిజెపి కార్యకర్తలు ప్రతి గడపకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీ కాంతరెడ్డి కార్యకర్తలను కోరారు. గురువారం అమరచింత మండలంలోని నాగర్ ,కడుమూర్ ,ధర్మాపూర్ ,నందిమల్ల,చంద్రఘడ్,ఈర్లదిన్నె,చింతరెడ్డిపల్లి ,మిట్ట ,,నందిమల్ల, ప్రియదర్శిని గ్రామాలలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో అబద్ధాల హామీలు ఇచ్చి తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని ఎన్నికలలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిన ఇప్పటివరకు 40 శాతం రుణాలు మాఫీ కాలేదని ఆయన అన్నారు. అలాగే మహిళలకు 2500 పెన్షన్లు పెంచుతామని హామీ ఇచ్చిన ఇప్పటివరకు హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఆయన విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపిభారీ విజయం సాధిస్తుందని గ్రామాలలో బిజెపి పార్టీ సభ్యత్వాన్ని తీసుకోవడానికి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని ఆయన అనందరం వ్యక్తం చేశారు. అలాగే దేశ ప్రధానమంత్రి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీ ఎఐసిసి అగ్ర నాయకులు రాహుల్ గాంధీ హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని హిందూ దేవతలను విమర్శిస్తున్న రాహుల్ గాంధీకి దేశంలో ఉండే అర్హత లేదని తక్షణమే దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బూత్ నాయకులు ప్రతి బూత్ లో 300 సభ్యత్వాలు చేయించాలని అలాగే మఖ్తల్ నియోజకవర్గంలో 50 వేల సభ్యత్వం చేయడం జరుగుతుందని ప్రతి బిజెపి కార్యవర్గం కష్టపడి పని చేయాలని ఆయనకార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి సభ్యత్వ వనపర్తి జిల్లా కో కన్వీనర్ మరాటి అశోక్ కుమార్, బిజెపి మండల ఉపాధ్యక్షులు మల్లారెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

### పంటల దిగుబడిపై శాస్త్రీయ అంచనా..

**బిజినపల్లి, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** రైతులు సాగు చేసిన పంటల దిగుబడిపై వ్యవసాయ అధికారులు శాస్త్రీయఅంచనా కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. లట్టుపల్లి గ్రామంలో పంట కోత ప్రయోగంలో భాగంగా జొన్నపంట దిగుబడి తెలుసుకోవడానికి పంట కోత ప్రయోగం చేయడం జరిగింది. ఈ ప్రయోగంలో కేంద్ర ప్రభుత్వ సీనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పర్వేజ్ అన్సారి, మండల వ్యవసాయ అధికారి బి. నీతి తనిఖీ చేశారు. ఇందులో ఏఈఓ శారద, ఎంపిఎస్ఓ గోపి పాల్గొన్నారు.

### రైతులకు అందుబాటులో యూరియా

**బిజినపల్లి, సెప్టెంబరు12 ప్రభాతవార్త :** మండలంలోని రైతులకు వివిధ పంటలకు అవసరమైన యూరియా నిల్వలను అందుబాటులో ఉంచినట్లుమండల వ్యవసాయ అధికారి నీతిరెడ్డి తెలిపారు. లట్టుపల్లి ఆగ్రో సేవా కేంద్రం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో మొత్తం 244 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. ఆగ్రో రైతుసేవా కేంద్రాల్లో108 మెట్రిక్ టన్నుల యూరియా, ప్రైవేట్ డీలర్ల దగ్గర41 మెట్రిక్ టన్నుల యూరియా, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బిజినపల్లిలో 95 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నట్లు చెప్పారు. రైతు సోదరులుఎరువులు కొనుగోలుచేసేటప్పుడు తప్పనిసరిగాఆధార్ నంబర్ తీసుకునిఎరువులు కొనుగోలుచేయాల్సి ఉంటుందని, డీలర్లకు బాస్‌మిషన్ ద్వారానేఎరువులు విక్రయించాల నిలేనిచో కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

### అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లు పట్టివేత




**పెబ్బేరు సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లు టిఎస్ 32ఈ4052 ,టిఎస్32ఈ4380,టిఎస్32ఈ3600,టిఎస్22 డబ్ల్యూ6472,వెహికల్ నెంబర్‌గల4 ట్రాక్టర్లను పెబ్బేర్ ఎస్సైసిహెచ్ హరిప్రసాద్‌రెడ్డి, కానిస్టేబుల్స్ ఆధ్వర్యంలో పట్టుకొని సీజ్ చేయడం జరిగింది. ఈ ట్రాక్టర్లు ప్రస్తుతం పెబ్బేర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**భూత్పూర్, సెప్టెంబర్ 12,ప్రభాతవార్త:** ట్రస్మా నేతృత్వంలో జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు గురువారం సన్మానించారు. సన్మానం పొందినవారిలో భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్ దయానంద విద్యా మందిర్‌కు చెందిన సురేందర్‌గౌడ్, హరినాథ్, అంజి,షాహిన్‌బేగం,శోభ ఉన్నారు. విద్యలో మంచి ప్రతిభ,నైపుణ్యం ప్రదర్శించిన ఉపాధ్యాయుల్ని ఉత్తములుగా ఎంపిక చేసి అవార్డులను ట్రస్మా అధ్యక్షుడు ప్రభాకర్ ప్రదానం చేశారు.



### ఎమ్మెల్యే జిఎంఆర్‌ను పరామర్శించిన మంత్రి



**చిన్నచింతకుంట, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి తండ్రి జి. కృష్ణారెడ్డి ఇటీవల కన్నుమూశారు. గురువారం రాష్ట్ర రెవెన్యూ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, శ్రీరాంరెడ్డిలు స్వర్గీయ కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఉమ్మడి జిల్లా చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే జిఎంఆర్‌ను పరామర్శించారు.

## గంగమ్మ ఒడికి గణనాథులు

◆జిల్లాలో పలుచోట్ల నిమజ్జనాలు
◆ఆకట్టుకున్న శోభాయాత్రలు










వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగరా ఆరవ రోజు జిల్లాలోని పలుచోట్ల గణేష్‌లను నిమజ్జనానికి తరలించారు. ప్రత్యేక అలంకరణలతో వాహనాలను ఏర్పాటు చేసి గణేష్‌లను నిమజ్జనానికి తరలించారు. డిజె శబ్దాలతో, కోలాటాలు నృత్యాలు చేస్తూ గణేష్‌ని శోభాయాత్రతో అత్యంత వైభవంగా నిర్వహించారు. జడ్చర్ల నియోజకవర్గంలోని మీనాంబరం వాగు, జోగులాంబ గద్వాల జిల్లాలోని బీచుపల్లి వద్ద పెద్ద ఎత్తున నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. నిమజ్జనం దగ్గర జిల్లా పోలీస్ యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.

మహబూబ్‌నగర్ బ్యూరో,సెప్టెంబరు 12 ప్రభాతవార్త :

## గణపతి లడ్డు దక్కించుకున్న ముస్లిం


వేలం పాటలో లడ్డు తీసుకెళ్తున్న ముస్లింలు

**చిన్నంబావవి, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన సంఘటన చిన్నంబావి మండలం బెక్కెం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో గణపతిని ప్రతిష్ఠించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గురువారం గణపతి మండపంలో లడ్డును వేలంపాట నిర్వహించారు. వేలం పాటలో కుల మతాలకతీతంగా ముస్లిం సోదరులు తాజుద్దీన్, మహ్మద్‌లు లడ్డు వేలం పాటలో పాల్గొని గత ఐదు రోజులుగా పూజలందుకున్న గణపతి లడ్డూరు రూ.15 వేలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ సంఘటన కుల, మత సామరస్యతకు ప్రతీకగా నిలవడంతో పలువురి ప్రశంసలు అందుకున్నారు. భగవంతుడు సర్వాంతర్యామి అని అందుకే హిందువైనా, ముస్లిం అయినా అందరూ బంధువులేనని వారు వ్యాఖ్యానించారు.

## లయన్స్ క్లబ్ ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే




**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల లయన్స్ క్లబ్‌ను గురువారం కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, నారాయణపేట లయన్స్ క్లబ్ హరినారాయణ బట్టడ్ ప్రారంభించారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ ఛైర్మన్ భీమయ్యగౌడ్, సెక్రెటరీ రవీంద్రనాథ్, ట్రెజరర్‌గా కాన్‌కుర్తి బసిరెడ్డి ఎన్నుకోగా, లయన్స్ క్లబ్ ఆఫ్ దామరగిద్ద ప్రారంభోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి, నారాయణపేట లయన్స్ క్లబ్ హరినారాయణ బట్టడ్ మాట్లాడారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సభ్యులతో పాటు నూతనంగా ఎన్నుకోబడిన సభ్యులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో దామరగిద్ద మండల లయన్స్ క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## నైపుణ్యం,సామర్థ్యం అవసరం

మొదటి పేజీ తరువాయి భాగం..

ఇస్తున్నారు. పోలీసులంటే ప్రజలకు ఎంతో నమ్మకం, ధైర్యం, భరోసా ఉంటుంది. అందుకే ప్రతి పోలీసు అన్ని రంగాలలో ప్రతిభ కనబరిచినప్పుడే ఈ సమాజాన్ని సంరక్షించే శక్తి సామర్థ్యాలను పొందుతూ, ప్రజల విశ్వాసాన్ని చూరగొంటామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, డిటిసి వైస్ ప్రిన్సిపల్ డిఎస్పీ నరసింహులు, డిటిసి అవుట్‌డోర్ ఇంఛార్జి ఆర్‌ఐ రమేష్, చీఫ్ లా ఇన్స్‌పెక్టర్ రవికుమార్, ఇతర శిక్షణా సిబ్బంది పాల్గొన్నారు.

## సింగిల్ డోనర్ ప్లేట్ లెట్స్ మిషన్‌ను ప్రారంభించిన కలెక్టర్

మొదటి పేజీ తరువాయి భాగం..

సిబ్బంది ఈ సాంకేతికతను సమర్థంగా ఉపయోగించి ప్లేట్‌లేట్స్ అవసరమైన రోగులకు తక్షణ సహాయం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛత మరియు వ్యాధి నివారణ చర్యలను పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులకు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్క వైద్యాధికారి,సిబ్బంది తమ బాధ్యతను మరింత నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి, వారి ఆరోగ్యాలను కాపాడే దిశగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హస్పిటల్ సూపరింటెండెంట్ వినోద్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ పార్వతమ్మ,డా.మాధవి, అసోసియేట్ పాతాలజిస్టు, మెడికల్ ఆఫీసర్ వృషాలి, ఇతర వైద్యులు, టెక్నీషియన్ రామ కృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి భాగం..

ఉండేందుకు ప్రభుత్వం వేల కోట్ల భారాన్ని మోస్తూ రూ. 500లకే సిలిండర్‌ను పేదలకు అందిస్తుందన్నారు. లబ్దిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రమేష్, తహసిల్దార్ సతీష్‌కుమార్, మాజీ జడ్పీటిసి జి. లక్ష్మారెడ్డి, నాయకులు గవినోళ్ల గోపాల్‌రెడ్డి, గణేష్‌కుమార్, రవికుమార్, సూర్యకుమార్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లు పట్టివేత

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రం, సరబ్ బజార్‌కు చెందిన అశోక్ ప్రసారి కిరాణా షాపులో ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లను అమ్ముతున్నారన్న పక్కా సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ,నారాయణపేట పోలీసులుదాడులు నిర్వహించి రూ.10,555 విలువ గల ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి అశోక్ ప్రసారిపై నమోదు చేయడం జరిగిందని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

### నేడు విద్యుత్ అంతరాయం

**లింగాల, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** నేడు లింగాల మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నుంచి అచ్చంపేటకు వచ్చే 132 కెవి లైన్ మరమ్మతుల కారణంగా అచ్చంపేట పరిధిలోని అచ్చంపేట,లింగాల, బల్మూరు, ఉప్పునుంతల, అమ్రాబాద్ పరిధిలోని 33/11 కెవి సబ్ స్టేషన్‌లో శుక్రవారం మధ్యాహ్నం 3 గం.ల నుండి సాయంత్రం వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని రైతులు, వ్యాపారస్తులు సహకరించాలని కోరారు.

### ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ జన్మదిన వేడుకలు

**లింగాల, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రంగినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు లింగాల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొత్త నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలు నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాల్చి కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పూజారి వెంకటయ్య, తాలూకా గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శంకర్ రాథోడ్, మాజీ మండల వైస్ ఛైర్మన్ కొండలరావు, జ్ఞానేశ్వర్‌రెడ్డి,నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉల్లంగొండ రాజు, మాజీ సర్పంచ్ రాయవరం మల్లయ్య, ధారారం శ్రీశైలం, రాజుల్, సుధాకర్‌గౌడ్, చెంచేటి శివ, తరుణ్, హరితేజ పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి భాగస్వాములు కావాలి

■ నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. రాజేష్‌రెడ్డి


కేసరిబండ ఆంజనేయస్వామి ఆలయంలో మొక్కు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే

**బిజినపల్లి, సెప్టెంబరు 12 ప్రభాతవార్త:** పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు అనే నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకొని గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే డా.రాజేశ్‌రెడ్డి అన్నారు. గంగారం, కీమ్యాతండాల్లో బుధవారం ఎమ్మెల్యే పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీలకతీతంగా గ్రామస్తులంతా ఒక్క తాటిపై నిలిచి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించుకోవాలన్నారు. పచ్చదనం పారిశుద్ధ్యం ప్రగతిలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని కోరారు. ఎస్టీ సెల్ నాయకులు రామచందర్ కోరిక మేరకు కేసరి బండపై వెలసిన ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేసి 101 కొబ్బరికాయలతో మొక్కు తీర్చుకున్నారు. గంగారం గ్రామంలో గుంటి నారాయణ చేపట్టిన పిరమిడ్ ధ్యాన మందిరానికి భూమి పూజ చేశారు. యువజన సంఘం భవనానికి భూమి పూజ చేసి గ్రామంలోని పలు వినాయక మండపాల్లో ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలోమాజీ సర్పంచ్‌లు గంగనమోని తిరుపతయ్య, అమృత్‌రెడ్డి,అవంతి, శంకర్, హరీశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, వీరేష్, నసీర్, ఎస్టీసెల్ నాయకులు వాల్యానాయక్, రాంచందర్ నాయక్, బద్యశంకర్, సతీష్, రవిందర్ నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాజేష్

## ఇంటిగ్రేటెడ్ భవన సముదాయాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే


ఇంటిగ్రేటెడ్ భవన సముదాయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** వనపర్తి పాత మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన ఇంటిగ్రేటెడ్ భవన సముదాయాన్ని గురువారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సందర్శించి పరిశీలించారు. కోట్ల రూపాయలు వెచ్చింది నిర్మించిన ఈ భవన సముదాయం నిరుపయోగంగా ఉందని ఉపయోగంలోకి తీసుకురావాలని మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్‌ను ఆయన ఆదేశించారు. విద్యాలయాలకు సంబంధించి సొంత భవనాలే లేక అద్దె భవనాల్లో కొనసాగుతూ లక్షల రూపాయల అద్దె చెల్లిస్తున్నామని అలాంటి అవకాశాన్ని కూడా మార్కెట్ యార్డ్ సద్వినియోగపర్చుకోవాలని సూచించారు, వీలైనంత త్వరగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను టౌన్ హాల్‌ను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,వైస్ చైర్మన్ రామకృష్ణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్,కౌన్సిలర్లు నక్క రాములు శరవంద మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు సురేష్ లతీఫ్,నాయకులు సత్యశీల రెడ్డి,శ్రీహరి రాజు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదిఇతరులు పాల్గొన్నారు.

## ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్


మున్సిపల్ సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్

**వనపర్తి ప్రతినిధి సెప్టెంబర్12 ప్రభాతవార్త :** ఎల్.ఆర్.ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ తన ఛాంబర్ లో ఎల్.ఆర్.ఎస్ పై మున్సిపల్ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. అక్రమ లే అవుట్లు, ప్లాట్‌లు వనపర్తి జిల్లాలో ఎన్ని ఉన్నాయి,ఎక్కడెక్కడ ఉన్నాయి, ఎల్.ఆర్.ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న యజమానులు ఎక్కడెక్కడ ఉన్నారు.అనేది గుర్తించి నిబంధన ప్రకారం ఉన్న వాటికిరిజిస్ట్రేషన్ ప్రక్రియపూర్తి చేయాలని సూచించారు. అందుకు అనుసరించాల్సిన మెళకువలు, నిబంధనలను సిబ్బందికి అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్‌లు,టౌన్ ప్లానింగ్ అధికారి , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు మేము సైతం


గుంతలను పూడ్చివేస్తున్న పోలీస్ శాఖ అధికారులు

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాల నివారణకు మేము సైతం అంటూ నారాయణపేట జిల్లా కేంద్రంలో గురువారం యాదగిరి రోడ్డు నుంచి సింగారం చౌరస్తా వరకు గుంతల పూడ్చివేత, రోడ్డు ప్రమాదాల నివారణకు మేము సైతం అంటూ నారాయణపేట పోలీస్‌శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా కేంద్రంలోని యాద్గిరి రోడ్డు నుంచి సింగారం చౌరస్తా వరకు ప్రధాన బిటి రహదారిపై ఏర్పడిన ప్రమాదకరమైన గుంతలను ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు కంకర మిశ్రమంతో కూడిన డస్ట్‌తో పూడ్చి వేశారు. గత కొన్ని రోజులుగా ఈ రహదారి గుండా ప్రయాణిస్తున్న వాహనదారులు రోడ్డుపై ఏర్పడిన గుంతలతో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదకరమైన గుంతలవల్ల కింద పడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. దీనిపై స్పందించిన పోలీస్‌శాఖ ప్రమాదకరమైన గుంతలను పూడ్చాలని నిర్ణయించి గురువారం దాదాపు 3 కి.మీ మేర ప్రధాన బిటి రహదారిపై అక్కడక్కడ ఏర్పడిన గుంతలను కంకర డస్ట్ వేసి పూడ్చివేశామని ఎస్సై తెలిపారు. పోలీస్ శాఖ చేస్తున్న కృషిని పట్టణ వాసులు, వాహనదారులు ప్రశంసించారు. కార్యక్రమంలో పేట పోలీసులు ఎఎస్సై అంజిలయ్య, పిసిలు గోపాల్, నరసింహ, హెచ్‌జి సుధాకర్ పాల్గొన్నారు.

## రైతులందరికి రుణమాఫీ చేయాలి : సిపిఐ


కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, సెప్టెంబరు 12 ప్రభాతవార్త :** నిబంధనలు లేకుండా రైతులకు రెండు లక్షల రుణ మాఫీ అందజేయాలని, ఇటీవల అకాల వర్షాలు కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కొండన్న డిమాండ్ చేశారు. గురువారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలియజేసి కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు పలు డిమాండ్‌లో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కొండన్న మాట్లాడుతూ వర్షాల కారణంగా అనేక మంది పేదల ఇండ్లు కూలిపోవడం, లక్షలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని గ్రామీణ ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారులన్ని పాడైపోయి తీవ్ర నష్టాన్ని మిగిల్చిందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు వెంకటేష్, సంతోష్,నర్సిలు, చెన్నప్పలతో పాటు ఏఐటియుసి, డిహెచ్‌పీఎస్ నాయకులు శ్రీనివాసులు, హన్మంతు, నర్సిలు,వెంకటయ్య, భాను, కథలప్ప, సమంసింహారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా నవరాత్రి ఉత్సవాలు

**పెబ్బేరు సెప్టెంబర్ 12 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలంలోని బునాధియపురం గ్రామంలో శివాజీ యూత్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన మల్లేష్ యాదవ్ అతని భార్య కీర్తిశేషులు వనం స్వాతి జ్ఞాపకార్థం వినాయకునికి సహాయ సహకారాలు అందించి గురువారం రోజు సాయంత్రం 6 గంటలకు అన్న ప్రసాద వితరణ చేయడం జరిగింది. అన్నదానానికి సహకరించిన మల్లేష్ యాదవ్‌ను శివాజీ యూత్ తరపున సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో శివాజీ యూత్ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


శివాజీ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణేశుడు

### ఘనంగా వినాయక చవితి పూజలు



**కొత్తకోట సెప్టెంబర్ 12 ప్రభాతవార్త :** కొత్తకోట మండల కేంద్రంలో గణేష్ నగర్‌లోని రచ్చబండ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నవినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆరో రోజు పూజ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి వేముల సుజాత కుటుంబసమేతంగా పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈసంవత్సరం ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, వ్యాపారాలు బాగాజరగాలని, ప్రతిసంవత్సరం జరుపుకునే వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో జరపుకోవాలని ఆవిఘ్నేశ్వరుడు ఎల్లవేళలా కరుణించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు, చిన్నారులు ఉత్సాహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.